# హైదరాబాద్ వార్త

## మద్యం మత్తులో యువతి వీరంగం


నడిరోడ్డుపై మద్యం మత్తులో రెచ్చిపోతున్న యువతి, యువకుడు

**మన్సూరాబాద్, మే 24 ప్రభాతవార్త:**
వేకువఝామునే మద్యం తాగుతూ చిందులేస్తూన్న ఓ యువతి, యువకుడిని ఇది తప్పు ఇలాంటివి ఇక్కడ చేయొద్దు అని మందలించిన వాకర్స్‌పై యువతి నానా బూతులు తిడుతూ రెచ్చిపోయిన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. నాగోల్ ఆనంద్‌నగర్ ఫత్తుల్లాగూడ జీఎస్ఐ గేట్ ఎదురుగా ఉన్న రహదారిలో ఎంతోమంది చుట్టుప్రక్కల కాలనీవాసులు వాకింగ్ చేస్తూంటారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడ అలానే కొందరు వాకర్స్ ఆ దారి గుండా వాకింగ్ చేయసాగారు. కాగా ఇదే దారి ప్రక్కన ఉదయం 6 గంటల సమయంలో ఓ యువతి, యువకుడు ఒక కారులో వచ్చి దిగి రహదారిపై బీరు సీసాతో మద్యం సేవిస్తూ సిగరేట్ తాగుతూ వాకర్స్ కి కనిపించారు. దీంతో కొందరు వాకర్స్ ఇదేమీ పని ఇక్కడ ఇలాంటివి చేయెద్దు అని సున్నితంగా మందలించి ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలని సూచించారు. దీంతో సదరు యువతి మీకు సంబందం లేదు, మీరు వెళ్లిపోవాలని నేను ఇక్కడ ఇలానే చేస్తాను మీరు ఎవరూ నాకు చెప్పేది అంటే ఎదురు ప్రశ్నించింది. దీంతో అక్కడే ఉన్న కొందరు వాకర్స్ ఈ ఘటనను ఫోన్‌లో రికార్డు చేస్తుండగా వారిపై చిందులు వేస్తూ వారిపై దాడికి దిగి వాకర్స్‌పై దుర్భాషలాడింది. దీంతో వాకర్స్ సదరు యువతి, యువకుడి పై నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేస్తామని చెప్పగా చిన్నగా అక్కడి నుండి ఆ జంట జారుకున్నారు. కాగా తెల్లవారుఝామునే మద్యం సేవిస్తూ, సిగరేట్ తాగుతూ చిందులేస్తున్న నేటి యువత ప్రవర్తనపై వృద్దులు కలికాలం అంటూ నిట్టూర్చుకుంటు వెళ్లిపోయారు. కాగా ఈ ఘటనకు సంబందించి కేసు నమోదు చేశామని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్‌గా లతా ప్రేమ్‌గౌడ్ ఏకగ్రీవం

- ఊరేగింపులో పాల్గొని, శుభాకాంక్షలు తెలిపిన ఎంపి రంజిత్‌రెడ్డి
- సంబరాలు చేసుకున్న అనుచరగణం
- భారీ గజమాలలతో నూతన మేయర్‌ను సత్కరించిన అభిమానులు


రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నూతన మేయర్‌గా నియామక పత్రంను అందుకుంటున్న మద్దెల లతా ప్రేమ్‌గౌడ్.

**నార్సింగి, మే 24 ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నూతన మేయర్‌గా మద్దెల లతా ప్రేమ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం కార్పోరేషన్ కార్యాలయంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్రలు మేయర్ ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ సమావేశానికి మొత్తం 17.మంది కార్పోరేటర్లు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి నూతన మేయర్ అభ్యర్థిగా 17.వ,డివిజన్ కార్పోరేటర్ లతా ప్రేమ్‌గౌడ్ పేరును ప్రతిపాదించారు. 4.వ,డివిజన్ కార్పోరేటర్ మంద రవీందర్‌రెడ్డి బలపరిచారు. లతాగౌడ్ మేయర్ అభ్యర్థిగా ఉండాలని 16.మంది కార్పోరేటర్లు చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఆర్డీఓ వెంకట్‌రెడ్డి నూతన మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ చేత ప్రమాణస్వీకారం చేయించి, నియామక పత్రంను అందజేశారు. మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, 16.మంది కార్పోరేటర్లు లతాగౌడ్‌కు పుష్పగుచానచలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### లక్ష్యాన్ని సాధించిన లతా ప్రేమ్‌గౌడ్ :

ఎట్టకేలకు అనుకున్నది సాధించారు. మాజీ మేయర్ ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ మెజారిటీ కార్పోరేటర్లు అనేకమార్లు స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన కనిపించలేదు. దీంతో లతా ప్రేమ్‌గౌడ్ నాయకత్వంలో పార్టీలకు అతీతంగా కార్పోరేటర్లు అందరూ ఏకమై, రాజ్యాంగం కల్పించిన "అవిశ్వాస" అస్త్రంను సంధించారు. 40.రోజులకు పైగా క్యాంపు రాజకీయాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే రంగంలోకి దిగి క్యాంపులోని కార్పోరేటర్లు బయటకు రావాలని, లేదంటే రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తానని, డబ్బుల కోసమే అవిశ్వాసం పెట్టారని, క్యాంపులోని కార్పోరేటర్లు అవినీతి పరులని ప్రెస్‌మీట్ పెట్టి అవమానించారు. దీంతో కార్పోరేటర్లలో మరింత ఐక్యత పెరిగింది. ఒక్కో కార్పోరేటర్‌కు మధ్యవర్తుల ద్వారా రూ.కోటి ఆఫర్ ఇచ్చినా వారు ఖాతరు చేయలేదు. సాంకేతిక కారణాలను సాకుగా చూపి, కోర్టు నుంచి అవిశ్వాసంను వాయిదా వేయించారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే, మాజీ మేయర్‌లు ఎన్ని ఎత్తులు వేసినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తట్టుకొని నిలబడి "మేయర్ పీఠాన్ని" మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ అధిరోహించి, తన చిరకాల వాంఛను నెరవేర్చుకున్నారు.

### అంబరాన్నంటిన సంబురాలు :

మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ నూతన మేయర్‌గా ఎంపికవడంతో ఆమె అభిమానులు, అనుచగణం చేసుకున్న సంబురాలు అంబరాన్ని అంటాయి. భారీ ఎత్తున బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి, ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భారీ గజమాలలతో నూతన మేయర్ లతాగౌడ్‌ను సత్కరించారు. చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి, రాష్ట్ర పాడీ పరిశ్రమ శాఖ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులతో కలిసి లతాప్రేమ్‌గౌడ్ భారీ ఊరేగింపును చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినదించారు. నూతన మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు పోటెత్తారు.


అధికారులు మార్కింగ్ చేసినా యధేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణం


అక్రమ కట్టడమని అధికారులు తేల్చిన తర్వాత కూడా నిర్మాణం పూర్తి చేసిన వైనం

## కబ్జారాయుళ్లకు కొమ్ముకాస్తున్న హెచ్ఎండిఏ..!




- గాలిలో దీపంగా మియాపూర్ భూముల రక్షణ
- సర్వేలో కబ్జాలను గుర్తించి అక్రమార్కులతో అంటకాగుతూ..
వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూములను పంచిపెడుతున్నారు.
- అధికారులు బాధ్యతలు విస్మరిస్తుండగా ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు.

**సైబరాబాద్ ప్రతినిధి, మే 24 ప్రభాతవార్త**
**కంచే చేను మేసిన చందంగా కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు... ఒకటికాదు, రెండు కాదు పట్ట పగలు ప్రభుత్వ భూమిలో పదికి పైగా అక్రమ నిర్మాణాలు ఏక కాలంలో నిరాటంకంగా కొనసాగుతున్నాయి... ఇదెక్కడో మారుమూల పల్లె టూరులో కాదు అక్షరాల గజం లక్షలు పలికే హైటెక్సిటీకి కూతవేటు దూరంలోని మియాపూర్‌లో జరుగుతున్న తతంగమిది. వేలకోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమి రక్షణ బాధ్యతలు చేపట్టిన హెచ్ఎండిఎ అధికారులు అక్రమార్కులను ప్రోత్సహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కబ్జాల విషయమై తామే స్వయంగా స్పందించాల్సిందిపోయి ఎన్ని ఫిర్యాదులొచ్చినా బుట్టదాఖలు చేస్తూ అడిగినవారికి కుంటిసాకులు చెబుతున్నారు. రెండు నెలల క్రితం ప్రభాతవార్త దినపత్రికలో 'వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో హెచ్ఎండిఎ అధికారుల దొంగాట' అన్న శీర్శికన ప్రధాన కథనం ప్రచురించినా కాకమ్మ కబుర్లు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్న వైనంపై ప్రభాతవార్త మరో కథనం.**

శేరిలింగంపల్లి మండలంలోని మియాపూర్ జంట సర్వేనెంబర్లు 100, 101లలో 545ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. దశాబ్దాల క్రితం కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది చేసిన తప్పిదానికి ఉన్నట్టుండి హక్కుదారులు పుట్టుకొచ్చి ఈ భూముల వ్యవహారం న్యాయస్థానాల వరకు వెళ్లింది. చివరగా 2003వ సంవత్సరంలో హైకోర్టు ఈ భూములు ప్రభుత్వానివేనంటూ స్పష్టమైన తీర్పు ఇచ్చినా, ఆశచావని బడాబాబులు సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారు. ఈభూములపై సుప్రీంకోర్టు స్టేటస్‌కో మంజూరు చేయగా అప్పటి ప్రభుత్వం ఈ భూముల పరిరక్షణ బాధ్యతను అప్పటి హుడా చేతిలో పెట్టింది. కాలక్రమంలో హుడా హెచ్ఎండిఎగా రూపాంతరం చెందగా ఆవిభాగం అధికారులే ఈ భూముల పరిరక్షణ బాధ్యతను మోస్తున్నారు. హెచ్ఎండిఎతోపాటు స్థానిక రెవెన్యూ విభాగం సైతం సమిష్టిగా ఈభూముల పరిరక్షణ బాధ్యతలు చేపడుతున్నాయి. ఇదిలావుండగానే ఆరేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో ఇవే భూములపై అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరుగగా ఈవ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈవ్యవహారం అసెంబ్లీని సైతం కుదిపేయగా వేలకోట్ల ఈ కుంబకోణంలో పాత్రుడైన సబ్‌రిజిస్ట్రార్‌ను సస్పెండ్‌చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోగా అప్పటికైనా కనీసం ఈభూముల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**తిలాపాపం తలా పిడికెడు..**
రిజిస్ట్రేషన్ వ్యవస్థలోవున్న లొసుగులను ఆసరాగా చేసుకొని ఈస్థలం చుట్టూ ఉన్న ప్రైవేటు సర్వేనెంబర్లలో ఏర్పాటైన కాలనీల లేఅవుట్‌లకు బైనెంబర్లు వేస్తూ కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇవే స్థలాలకు జిహెచ్ఎంసి అధికారులు సైతం అందినకాడికి దండుకుంటూ అనుమతులు మంజూరు చేస్తుండడంతో యధేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈవిషయమై ప్రభాతవార్త గత రెండు దశాబ్దాలుగా కోకొల్లలుగా కథనాలు వెల్లడిస్తూనేవున్నా కంటితుడుపు చర్యగా అక్రమ నిర్మాణాలను కూలగొడుతున్న హెచ్ఎండిఎ, రెవెన్యూ అధికారులు వెంటనే హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేస్తామని చెబుతూ ఆతర్వాత అటువైపు చూడటంలేదు. ఇదే అదునుగా కబ్జాదారులు రెచ్చిపోతూ విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపడుతున్నారు.

**సర్వే చేసి కూడా సమర్పించారు.**
గతకొన్ని నెలలుగా హెచ్ఎమ్‌డిఎ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఈభూముల్లో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈవిషయమై పోయిన మార్చినెల 18వ తేదీన ప్రభాతవార్త ప్రత్యేక కథనం వెలువరించి పలుమార్లు వత్తిడి చేయడంతో విధిలేని పరిస్థితిలో ముందుకు వచ్చిన హెచ్ఎండిఎ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించి పలు అక్రమ భవనాలను గుర్తించి మార్కింగ్ చేశారు. తామే స్వయంగా మార్కింగ్ చేసిన భవనాలపై చర్యలు తీసుకోవడంలో హెచ్ఎండిఎ అధికారులు విఫలమవడంతో అక్రమార్కులు మరింతవేగంగా ఆక్రమణలను పూర్తి చేసి గోడలకు రంగులు కూడా వేసుకుంటున్నారు. ఈవిషయమై హెచ్ఎండిఎ ఎస్టేట్ అధికారి వీరారెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా తమ కింది స్థాయి సిబ్బందిని కనుక్కుంటానని తెలిపి తర్వాత స్పందించడం మానేశాడు. డిప్యూటీ ఎస్టేట్ అధికారిణి దివ్యారెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా భవనాలు పుట్టుకొచ్చాయని, అంత పెద్ద భవనాలను ఇప్పుడు తాము ఏమి చేయగలమంటూ సమాధా నమిచ్చారు.

**కూల్చాల్సిన బాధ్యత వారిదే : తహసిల్దార్ వెంకారెడ్డి**
మియాపూర్ సర్వేనెంబర్లు 100,101లలో కొనసాగుతున్న అక్రమ భవనాల విషయమై తాము హెచ్ఎండిఎతో కలిసి సర్వే నిర్వహించి అక్రమ భవనాలకు మార్కింగ్ కూడా ఇచ్చామని శేరిలింగంపల్లి తహసిల్దార్ వెంకారెడ్డి తెలిపారు. అయితే తాము కేవలం సర్వే చేసి మాత్రమే ఇవ్వగలమని, ఇక్కడిప్రభుత్వభూములను కాపాడాలన్నా, అందులోవచ్చిన అక్రమ నిర్మాణాలను కూల్చాలన్నా అది హెచ్ఎండిఎ ఆధీనంలోనే ఉంటుందన్నారు. ఇరుశాఖల అధికారులు చేతులెత్తేయడంతో మియాపూర్‌లో వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూములు మరికొద్ది రోజుల్లో పూర్తిగా అన్యాక్రాంతమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

## పాతభవనాలపై "బల్దియా" ఫోకస్

- టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్వే ముమ్మరం - శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి నోటీసుల జారీ
- ఓల్డ్‌బిల్డింగ్‌లపై నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని హెచ్చరికలు



**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లో చారిత్రక కట్టడాలు ఎన్ని ఉన్నాయో ...శిథిలావస్థలో చేరిన భవనాలు కూడా అన్నే ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏదోఒక చోట శిథిలా భవనాలు కూలిపోవడం ..ప్రాణనష్టం జరగడం సంభవిస్తుంది. కొద్దిరోజుల క్రితం బాచుపల్లిలో గోడకూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అలాగే వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈక్రమంలో శిథిలావస్థలో చేరి బిల్డింగుల విషయంలో కఠినంగా వ్యహరించాలని జిహెచ్ఎంసి నిర్ణయించింది. నగరంలో ఇలాంటి భవనాలు ఎన్ని ఉన్నాయో సర్వే చేపట్టాలని కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించగా.. డిప్యూటీ సిటీప్లానర్లు, అసిస్టెంట్ సిటీప్లానర్లు కార్యాచరణ రూపొందించి కమిషనర్‌కు అందజేశారు. దీంతో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలు, నిబంధనలకు విరుద్దంగా ఉన్న సెల్లార్లను , పాతబవనాలపై కొత్తనిర్మాణాలు చేపట్టే వారిని సర్కిళ్ల వారీగా నోటీసులు ఇస్తున్నారు. వాస్తవానికి వర్షాకాలం విపత్తు నివారణలో భాగంగా టౌన్‌ప్లానింగ్ శిథిల భవనాలను గుర్తించడం, పాతభవనాలు పటిష్టత ,భద్రతపై ఇంజనీరింగ్ విభాగాల అభి ప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకర కట్టడాలను కూల్చివేసేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం సర్వే చేయాలి. ఈడ్రైవ్‌లో భాగంగా పురాతన భవనాలపై జోన్లవారీగా సర్వేచేసి సంబంధిత భవన నాణ్యతపై పరిశీలించి వారికి నోటీసులు ఇవ్వడమే కాకుండా వాటిని కూల్చివేదయం వంటివి చేయాలి. కానీ పలుజోన్లలో ఇలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**జోన్‌లవారీగా వివరాలు ..**
కూకట్‌పల్లిలో మొత్తం 40పురాతన భనాలను గుర్తించారు. వీటిలో నాలుగు భవనాలకు రిపేర్లు చేయాలని ఆదేశించారు. ఐదు ఇండ్లను ఖాళీ చేయించగా 32భవనాలపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు. అలాగే చార్మినార్ జోన్‌లో 128పురాతన భవనాలను ఉన్నట్లు గుర్తించారు. వారిలో ఆరింటిని కూల్చివేశారు. 5భవనాలకు రిపేర్లు చేయించుకోవాలని ఆదేశించారు. 9ఇండ్లను ఖాళీ చేయించారు. ఒక ఇంటిని సీజ్ చేశారు. మిగిలిన 107 భవనాలపై త్వరలోనే చర్యలు తీసుకోనున్నారు. అలాగే ఖైరతాబాద్ జోన్‌లో 87 పురాతన భవనాలను గర్తించి మూడు భవనాలను కూల్చివేశారు. 9భవనాలు రిపేర్లు చేయించుకోవాలని ఆదేశించారు. నాలుగు ఇండ్లను ఖాళీ చేయించగా 71భవనాలపై త్వరలోనే చర్యలు తీసుకోనున్నారు. సికింద్రాబాద్ జోన్‌లో 108 పురాతన భవనాలను గుర్తించారు. నాలుగు భవనాలకు రిపేర్లు చేయించాలని యజమానులను ఆదేశించారు. 4ఇండ్లు ఖాళీ చేయించారు. మరో వందభవనాలపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు. శేరిలింగంపల్లి జోన్‌లో మొత్తం 34 పురాత భవనాలు ఉన్నాయి. వీటిలో మూడు భవనాలను ఇప్పటికే కూల్చివేశారు. నాలుగు భవనాలు రిపేర్లు చేయాలని ఆదేశించారు. 12ఇండ్లను ఖాళీ చేయించగా ,15భవనాలపై చర్యలు తీసుకోనున్నారు. ఎల్బీనగర్ జోన్‌లో 61పురాతన భనవాలు ఉండగా..అందులో 14భవనాలను జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. 14 భవనాలలకు రిపేర్లు చేయించకోవాలని యజమానులను అదేశించారు. 10ఇండ్లను ఖాళీ చేయించారు. మరో 23భవనాలపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు.

## వచ్చే నెల నుంచి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

- విద్యార్ధులకు ప్రత్యేక సూచనలిచ్చిన విద్యాధికారి

**హైదరాబాద్ మే24, ప్రభాతవార్త:**
వచ్చేనెల జూన్ 3వ తేదీ నుంచి 13 తేదీ వరకూ పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి ఆర్. రోహిణీ తెలిపారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ జిల్లాలో 35 పరీక్షాకేంద్రాల్లో 12,186 మంది విద్యార్ధులు పరీక్ష రాయనుండడంతో, వారు సకాలంలో పరీక్షాకేంద్రాకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా సమయం ఉదయం 9:30 నుంచీ మధ్యాహ్నం 12:30 వరకూ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ మేరకు ఏయే సబ్జెక్టు పరీక్షలు ఏరోజు ఉంటాయో ప్రకటనలో వెల్లడించారు. జూన్ 3వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్ ఏ), పార్ట్1, పార్ట్2 (కాంపోజిట్ కోర్స్) సబ్జెక్టు పరీక్షలు నిర్వహిస్తారు, జూన్ 5న సెకెండ్ లాంగ్వేజ్, జూన్ 6న ఇంగ్లీష్, జూన్ 7న మేథమెటిక్స్, జూన్ 8న సైన్స్ పార్ట్1 ఫిజికల్ సైన్స్, జూన్ 9న సైన్స్ పార్ట్2 బయోలాజికల్ సైన్స్, జూన్ 11న సోషల్ స్టడీస్, జూన్ 12న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్1 (సంస్కృతం, అరబిక్), జూన్ 13 ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్2 (సంస్కృతం, అరబిక్) పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## మనీ సర్క్యులేషన్ స్కీమ్ పేరుతో మోసం

- బంజారాహిల్స్‌లో చీటింగ్ కేసు

**హైదరాబాద్ మే24, ప్రభాతవార్త:**
మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపి ఒక సంస్థ నెలకొల్పి భారీ ఎత్తున డబ్బు కాజేసిన మోసగాళ్ళపై జంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమొదయింది. వివరాల్లోకి వెళ్తే, వెంకటగిరి ప్రాంతంలో ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి బంగి రవికుమార్‌కు రెండేళ్ళ క్రితం పరిచయం అయిన కొండా రవి అనే వ్యక్తి అధిక లాభాల పేరుతో ఆశ కల్పించాడు, తాము కనకమహాలక్ష్మి సేవింగ్స్ పేరుతో మనీ సర్క్యులేషన్ పథకం పెట్టామనీ, నెలకు రూ.2వేలు పెడితే అధిక లాభాలు వస్తాయనీ నమ్మబలికాడు. అంతేకాకుండా, మధ్యలో లక్కీడ్రా ద్వారా బహుమతులు వస్తాయని చెప్పాడు. దాంతో కొండా రవిని నమ్మిన బాధితుడు వరుసగా 22 నెలల పాటు డబ్బు కడుతూ వచ్చాడు. అనంతరం అదును చూసుకున్న నిందితుడు రాత్రికి రాత్రే తన సేవింగ్స్ సంస్థను మూసేసి బిచాణా ఎత్తేయగా, ఇటీవలె విషయం తెలుసుకున్న బాధితుడు బంగి రవికుమార్ తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించాడు. దాంతో బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 420తో పాటు, ప్రైజ్,చిట్స్ ఎండ్ మనీ సర్క్యులేషన్ బ్యానింగ్ యాక్ట్ సెక్షన్3, 4 ప్రకారం చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తక్కువ ధరకే బంగారం అంటూ భారీ మోసం

- గోల్డ్ స్కీం పేరుతో రూ.4 కోట్లతో ఉడాయించిన ముఠా


**ఉప్పల్, మే 24 ప్రభాతవార్త :**
తక్కువ ధరకే బంగారం ఇస్తామని నమ్మించి ప్రజల నుంచి రూ.4 కోట్ల వరకు వసూలు చేసి పరారైన సంఘటన నగరంలోని రామంతాపూర్‌లో చోటు చేసుకుంది. బంధువులు, స్నేహితుల నుంచి డబ్బులు కట్టించుకుని పరారైన నిందితులను పట్టుకోవాలని పలువురు బాధితులు సిసిఎస్ పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్, అంబర్‌పేటకు చెందిన విశాల్, వినయ్, నిఖిల్ అనే వ్యక్తులు గోల్డ్‌స్కీం పేరుతో వ్యాపారం మొదలుపెట్టారు. గోల్డ్ స్కీంలో మొదట రూ.50వేలు కట్టి చేరితే 10 శాతం తక్కువకు బంగారం ఇస్తామని పలువురిని నమ్మించారు. ఇదే క్రమంలో వారి బంధువులు, స్నేహితులు, ఇతర వ్యక్తుల నుంచి సుమారు రూ.4 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. అయితే స్కీంలో చేరిన వారికి మొదట కొంత మందికి డబ్బులు ఇచ్చి అనంతరం తప్పించుకుని పోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వీరంతా కలిసి సుమారు రూ.4 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. దీనిపై బాధితులు సిసిఎస్ పోలీసులను ఆశ్రయించడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక పోలీసులకు దీనిపై ఎటువంటి సమాచారం లేదని పేర్కొంటున్నారు.

## పాలు తాగుతున్న మదీనగూడ పోచమ్మ దేవత

- హైటెక్‌సిటీ పరిసరాల నుంచి తరలివచ్చిన భక్తులు


అమ్మవారికి పాలు తాగిస్తున్న ఆలయ పూజారి

**సైబరాబాద్ ప్రతినిధి, మే 24 ప్రభాతవార్త**
శేరిలింగంపల్లిలోని మదీనగూడలోగల పురాతన పోచమ్మ గుడిలో అమ్మవారు భక్తులు సమర్పించే పాలను తాగడం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. ఈ విషయం తెలుసుకొని హైటెక్‌సిటీ సమీప కాలనీలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పాలను సమర్పించి తమ మొక్కులు తీర్చాల్సిందిగా వేడుకున్నారు. వివిద సామాజిక మాద్యమాల్లో ఈ వార్త వైరల్‌గా మారడంతో శుక్రవారం మధ్యాహ్నానికి వందలాదిగా భక్తులు ఆలయానికి పోటెత్తడంతో తొక్కిసలాట జరుగుతుందనే ఆందోళనతో కొంతసేపు ఆలయాన్ని మూసేయాల్సివచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఈఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి. శేరిలింగంపల్లి మియాపూర్ సమీపంలోని మదీనగూడ పాత గ్రామంలో పురాతన పోచమ్మ ఆలయం ఉంది. ఇక్కడ అమ్మవారు స్వయంభుగా వెలిసారని ఇక్కడి భక్తుల నమ్మకం. అయితే ప్రతినిత్యం అమ్మవారికి నిర్వహించే పూజల్లో భాగంగానే తాను అమ్మవారికి పాలు తాగిస్తుండగా అమ్మవారు పాలను పూర్తిగా తాగుతున్నట్లు తాను గుర్తించానని పూజారి నవీన్ తెలిపారు. బుధవారం, గురువారం ఇలాగే జరుగగా అందరూ ఇది సాధారణమే అంటారని తాను బయటకు చెప్పలేదన్నారు. అయితే శుక్రవారం ఉదయం సైతం అమ్మవారికి పాలు తాగిస్తుండగా పూర్తిగా తాగుతున్న విషయం గమనించి తాను స్థానికులకు తెలిపానన్నారు. దీంతో మదీనగూడతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరళివస్తున్నారని, అందరిచేత అమ్మవారికి పాలు తాగిస్తున్నామని తెలిపారు. అది పల్లెటూరు అయినా హైటెక్‌సిటీ అయినా భక్తుల నమ్మకంలో తేడా ఉండదని మరోమారు నిరూపితమైంది.


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టిన స్థానిక భక్తులు

# భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఫ్రిజ్ బహుకరించడం అభినందనీయం : దీపిక



సికింద్రాబాద్ గణేష్ దేవాలయంలో మంచినీటి ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్,మే 24 ప్రభాతవార్త:** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులకు చల్లటి మంచినీటిని సరఫరా చేసేందుకు ఫ్రిజ్‌ను ఆలయానికి బహుకరించడం అభినందనీయమని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. సికింద్రాబాద్ గణేష్ దేవాలయంలో రష్మిగోపాల్ అగర్వాల్ సహాయ సహకారాలతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్ ఫ్రిజ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వినోద్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**యువత వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలి : మాధవి లత**

**కంటోన్మెంట్,మే 24 ప్రభాతవార్త:** విద్యావంతులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార,పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెంది మరి కొందరికి ఉపాధి కల్పించే విధంగా ఎదగాలని హైదరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి మాధవి లత తెలిపారు. సికింద్రాబాద్ రైల్ నిలయం సమీపంలోని ప్రధాన రోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటో మోటీవ్ సెల్‌టాస్ హెచ్‌టీకెప్లస్ కొత్త వీరియంట్ కారును ఆమె ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఉపాసకులు దైవజ్ఞ శర్మ, షియా కంపెనీ సిఈఓ చిన్న కేశవ్, జిఎం. నరేశ్, అడ్మిన్ ప్రభాకర్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయం : శ్రీగణేష్



అంతర్జాతీయ కరాటే క్రీడాకారుడిని అభినందిస్తున్న కాంగ్రెస్ నేత

**కంటోన్మెంట్,మే 24 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సాయికుమార్ ఇటీవల మలేసియాలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్న సాయి కుమార్‌ను శుక్రవారం కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. శ్రీగణేష్ శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

**శ్రీనివాస్ మృతి పట్ల కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు : శ్రీగణేష్**

బొల్లారం డౌటాన్ బజార్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ హన్‌మాన్ దేవాలయం మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్ ఆయన భౌతికాయానికి పుష్పగుచ్చం అందజేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ మృతి చెందడం పట్ల కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు ఏర్పడిందన్నారు.

# హంసవాహనసేవలో శ్రీనివాసుడు




హంసవాహన సేవ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 24 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారు హంసవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, హవనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన, మంత్రపుష్పం నిర్వహించిన తదుపరి భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణం వంటి కార్యక్రమాలు పూర్తయిన అనంతరం 'హంసవాహనసేవ' జరిగింది. కాగా శనివారం పల్లకీసేవ, రాత్రి గజవాహనసేవ ఉంటుందని అధికారులు తెలిపారు..

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్**



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్, వైస్‌ప్రిన్సిపీల్ డాక్టర్ బండ్ల శ్రీధర్ తదితరులు

**చిక్కడపల్లి, మే 24 ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో బిఎ,బికామ్, అఖరి సంవత్సరం విద్యార్థులు సంయుక్తంగా వీడ్కోలు సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బండ్ల శ్రీధర్, కుమార స్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు తగు సూచనలు అందించారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచుకోవాలన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా కళాశాలలో మూడు సంవత్సరాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.అనంతరం విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. అనంతరం తమ టీషర్ట్‌లపై విద్యార్థుల, అధ్యాపకుల సంతకాలను పదిలపరుచుకున్నారు. అనంతరం అధ్యాపకులతో పాటు తమ అనుభవాలను పంచుకున్నారు.

**ఎఐటియుసి నేత రాజేందర్ మృతికి సంతాపం తెలిపిన బాల్‌రాజ్**

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యుడు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సివిల్ సప్లయీస్ హ మాలీ వర్కర్స్ యూనియన్ కోశాధికారి గాదం రాజేందర్ (39) శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందడం పట్ల ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. రాజేందర్ ఎఐటి యుసి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గత రెండు నెలల క్రితమే జిల్లా ఎఐటియుసి అధ్యక్షుడిగా ఎన్నికై, జిల్లాలో ఎఐటియుసి, సివి ల్ సప్లయీస్ హ మాలీ యూనియన్ బలోపే తానికి కృషి చేశారని, ఆయన చిన్న వయసు లోనే మృతి చెందడం కార్మికులు, కుటుంబ సభ్యులు తీవ్రమైన మనస్తాపానికి గురైనారని విచారం వ్యక్తం చేశారు. ఆయన లేని కార్మికు లకు తీరని లోటని, కుటుంబ సభ్యులకు బాల్ రాజ్ సానుభూతి తెలిపారు.

# అవినీతిమయం విద్యుత్ ఎస్‌ఈ, డిఇ కార్యాలయాలు

**-అధికారుల లీలలు. ఇష్టారాజ్యంగా వసూళ్ళు..**
**-కరప్షన్ కింగ్‌లకు రూ.కోట్లలో అక్రమాస్తులు**




ఎస్‌ఈ కార్యాలయం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ సూపరిండెంటింగ్ (ఎస్‌ఈ) ఆపరేషన్ కార్యాలయంతో పాటు కందుకూర్, రాజేంద్రనగర్ డీఇ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ఎస్‌ఈ డీఇ, ఏడీఇ, ఏఇ కార్యాలయాల్లో కొందరు అధికారులకు ముడుపులివ్వనిదే ఏ పనీ జరుగడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫోకల్(ఆదాయం వచ్చే) ప్రాంతాల్లో రూ.లక్షలు ఖర్చుపెట్టి సీటుని దక్కించుకొన్న కొంత మంది అధికారులు వడ్డీతో సహ రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఎస్‌ఈ, డీఇ, ఏడీఇ, ఏఈ కార్యాలయాల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నప్పటికీ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పట్టించుకోవడంలేదని పలువురు పేర్కొంటున్నారు.

కొందరు అధికారులు వసూల్ రాజాలుగా మారి నిత్యం లక్షలు తమ జేబుల్లో వేసుకుంటూ కోట్ల మేర అ క్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఉండే ఈ విభాగం అధికారులు కుమ్మక్కై పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతూ రూ. కోట్ల అక్రమాస్తులు కూడబెడుతున్నా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారించడంలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వినియోగదారులను దోచుకోవడమే తమ విధి అన్నట్లుగా అక్రమార్కులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని బాహటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. చేయి తడిపితే కాని అధికారులు పనులు చేయడంలేదనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. తమ పనులు చేసి పెట్టాలని వెళ్ళిన వారికి డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేనిపోని కారణాలు చూపిస్తూ అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారింది. ఫైళ్ళ క్లియర్ కోసం ఎస్‌ఈ, డీఇ, ఏడీఇ ,ఏఇ కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన వారు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి కరెంట్ కార్యాలయాల్లో నెలకొంది. చేయి తడిపితే మాత్రం అవసరమైన ధృవపత్రాలు ఉన్నా , లేకున్నా పనులు చకచకా చేసి పెడుతున్నారు. శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్దఎత్తున జరుగుతుండడంతో అక్రమార్కులకు కాసుల పంట పండుతోంది. కొత్త విద్యుత్ కనెక్షన్లకు వర్క్ ఎస్టిమేషన్ నుంచి బహుళ అంతస్తులకు ప్యానల్‌బోర్డులు, డీటీఆర్ మీటర్ల జారీలకు అందినంత దండుకుంటూ కొందరు రూ. కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు గసగుసలు వినిపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ బహుళంతస్తుల భవనాలు, విల్లాలకు కొత్త కనెక్షన్లు, ప్యానల్ బోర్డులు, డీటీఆర్‌లు, లైన్ల మంజూరుకు కొందరు డీఇలు, ఏడీఇ, ఏఇలు తమ ఇష్టారాజ్యంగా వసూళ్ళకు పాల్పడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. విల్లాలు, కమర్షియల్ భవనాలతోపాటు అపార్ట్‌మెంట్లకు కనెక్షన్ కావాలంటే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బహుళంతస్తుల, కమర్షియల్ విల్లాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు మూడు లక్షల నుంచి ఐదు లక్షలు, 15 లక్షలకు పైగానే ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పనికో రేటు అన్నట్లు లక్షల్లో దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే కొందరు ఉన్నతాధికారుల ఈ అక్రమాలకు సహకరిస్తూ రూ. కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు గుస గసలు వినిపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌కి విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే ఒకరేటు, త్రీఫేజ్ కనెక్షన్ తీసుకునేందుకు మరో రేటు, మీటర్ ఛేంజ్ చేసుకోవాలంటే ఇంకో రేటు, ఇలా ఒక్కో పనికి ఒక్కో రేటుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో వివాదాలు ఉన్నాయి. అక్కడ చేపట్టే కొత్త నిర్మాణాలకు ఎలాంటి కనెక్షన్లు మంజూరు చేయకూడదని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ గతంలోనే ఆదేశాలు జారీచేసింది. కాని క్షేత్ర స్థాయిలో అధికారులు ఇవేవి పట్టించుకోవడంలేదు. అడిగినంత ముట్టచెబితే చాలు మీటర్లే కాదు ఏకంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మరు , ప్యానల్ బోర్డులను మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పనికి ముందుగా అధికారులు వర్క్ ఎస్టిమేషన్లు వేయాలి. ఈ ఎస్టిమేషన్లు వేసేటప్పుడే కొంత మంది అధికారులు అక్రమాలకు పాల్ప డుతున్నారు. ఎస్టిమేషన్లు వేసే ముందు అడిగినంత ముడుపులు చెల్లిస్తే ఒక విధంగా డబ్బులివ్వకపోతే మరోలా వేస్తూ కొందరు అధికారులు సంస్థ ఆదాయానికి రూ. కోట్ల మేర భారీగా గండికొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారమే పెట్టుబడిగా కార్యాలయాల్లో కీలక అధికారులు చక్రం తిప్పుతున్నారు. ఎస్‌ఈ, డీఇ కార్యాలయాల్లో కీలక అధికారులు ఏడీఇలు, ఏఇలు, బ్రోకర్లతో తమ వసూళ్ళ దందా కొనసాగిస్తున్నారు. ప్రతి నెల రూ. లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా, లంచాలు లేకుండా కొంత మంది అధికారులు ఏ పనీ చేయడంలేదు.జేబులు నింపుకోవడమే లక్ష్యంగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు ఉన్నతాధికారుల మూలంగా ఎంతో మంది దరఖాస్తుదారులు నెలలతరబడి తమ పనులు క్లియర్ కావడం కోసం పడిగాపులు కాస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే ఈ విభాగం అధికారులు పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతూ రూ.కోట్ల అక్రమాస్తులు కూడబెడుతున్నా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించడంలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


# ప్రతి ఒక్కరూ ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలి : సినీనటుడు శ్రీకాంత్

**హైదరాబాద్,మే 24,ప్రభాతవార్త:** నిత్యం తీసుకునేఆహారంలో వ్యాయం చేసునతన్నవారు ప్రొఫెషనల్స్ మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ ప్రోటీన్ ఫుడ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సినీనటుడు హీరో శ్రీకాంత్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఫిట్‌నెస్ రివైవల్ అధినేత, సెలబ్రిటీ పిట్‌నెస్ ట్రైనర్ వెంకట్, ప్రముఖ వైద్యులు అమర్‌నాథ్ సంయుక్తంగా రూపొందించిన జాయింట్ న్యూట్రిషియన్ ఉప్పత్తులను ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఫిట్‌గా ఉండటానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారని ఆప్రయాణంలో మంచి ప్రోటీన్ ఉన్న ఫుడ్ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో హీరోహిన్ హెబ్బాపటేల్, ప్రముఖ నిర్మాత ఏఎస్ రత్నం, నటులు బాలాదిత్య, శ్రవణ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ న్యూస్‌లు రాయొద్దు ...

నిజమైన వార్తలు రాస్తే చాలామంచిదని కానీ తప్పుడు వార్తలు రాసేవెబ్‌సైట్లు, చానళ్లపై ఫిర్యాదు చేస్తానని వారు న్యాయపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి ఉంటుందని శ్రీకాంత్ పేర్కొన్నారు. రేవ్‌పార్టీ ఘటన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను రేవ్‌పార్టీలో ఉన్నట్లు వచ్చిన వీడియోలో ఉన్నది తాను కాదని చెప్పినా కూడా కొంతమంది ఇంకా వాటిని తానే అన్నట్లుగా ప్రసారం చేస్తున్నాయని అది మంచిపద్ధతి కాదన్నారు. అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని తాను కూడా పోలీసులు ,కోర్టుల్లో ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు. తనది రేవ్‌పార్టీలకు వెళ్లే నేచర్ కాదని శ్రీకాంత్ పేర్కొన్నారు.

# మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన కార్మికుడి అరెస్టు



విలేకరుల సమావేశంలో సిఐ శ్రీనివాస్ చారితో కలిసి మాట్లాడుతున్న సుల్తాన్‌బజార్ ఏసిపి శంకర్

**బేగంబజార్,మే24ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన భవన నిర్మాణ కార్మికుడిని సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు .సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌చారితో కలిసి ఏసిపి శంకర్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాకు చెందిన మాదాహరికృష్ణ(27)సుల్తాన్‌బజార్ మెట్రోస్టేషన్ నుంచి మైనర్ బాలికను కిడ్నాప్ చేసి విజయవాడకు తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు.ఆ తర్వాత ఓ లాడ్జిలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారి పోలీసులు తెలిపారు.ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపిసి,ఫోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసునమోదు చేశారు.అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. అమాయక బాలికను మాయమాటలతో నమ్మించి విజయవాడ తీసుకువెళ్లి హన్‌మాన్ మందిరంలో పెళ్లి చేసుకున్నట్లు వివరించారు.గతంలోనే హరికృష్ణకు వివాహం జరిగిందని,ఆ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు.బాధితురాలి తరపున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.ఈ కేసును ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన గృహిణి

**మలక్‌పేట, మే 24 ప్రభాతవార్త :** ఇంటి నుండి ఇద్దరు పిల్లలతో కలిసి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జయంత్ కథనం ప్రకారం మూసారాంబాగ్ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ఎం.వెంకటేష్‌కు 2020లో స్వాతితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు అభిగ్నన్ (4), వశిగ్నన్ (3)లు ఉన్నారు. కాగా ఈ నెల 21వ తేదీ ఉదయం వెంకటేష్ మార్నింగ్ వాక్‌కు వెళ్లగా ఇద్దరు చిన్నారులతో కలిసి అతని భార్య స్వాతి (28) ఇంటినుండి బయటకు వెళ్లిపోయింది. దీంతో భార్య పిల్లల ఆచూకికోసం చుట్టు పక్కల ప్రాంతాలు, స్నేహితుల, బంధువుల వద్ద గాలించిన ఆచూకి తెలియలేదు. భార్య స్వాతి సెల్ ఫోన్‌కు ఫోన్ చేస్తే స్విచ్డ్ ఆఫ్ వస్తుండడంతో భర్త వెంకటేష్ మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు ఎస్ఐ జయంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మరో సంఘటనలో...

కాలేజ్ హాస్టల్‌లో ఉంటున్న ఓ ఇంటర్మీడియట్ విద్యార్థిని హాస్టల్‌నుండి బయటకు వచ్చి అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎ ఎస్ఐ తేజనాయక్ కథనం ప్రకారం కూకట్‌పల్లిలో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కె.రామ్‌కోటిరెడ్డికి 2023లో లావణ్యతో వివాహం జరిగింది. కాగా లావణ్య (19) దిల్‌సుక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ కాలేజ్ హాస్టల్‌లో ఉంటుంది. కాగా ఈ నెల 16వ తేదీన తన కళ్లు మంటపుడుతున్నాయని ఇంటికి రావడానికి హాసల్ వార్డెన్ అనుమతి తీసుకోమని భర్త రాంకోటిరెడ్డికి లావణ్య ఫోన్ చేసి చెప్పింది. దీంతో భర్త రాంకోటిరెడ్డి హాస్టల్ వార్డెన్ నుండి అనుమతి తీసుకున్నాడు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు ఫోన్ తీసుకురాకుండా లావణ్య హాస్టల్ నుండి బయటకు వచ్చిం ది. భార్య లావణ్యకోసం కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ వద్ద భర్త రామకోటిరెడ్డి నిరీక్షించి ఎంతసేపటికి తన భార్య రాలేందు. దీంతో ఆమె ఆచూకి కోసం భర్త గాలించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. దీంతో భర్త మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎఎస్ఐ తేజనాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్,మే 24 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు అల్లామసీదు,కొండారెడ్డి గూడ,కిషన్‌బాగ్, మసూదియి మసీదు,బోజిరెడ్డి కాలనీ,అసద్‌బాబానగర్ ,కిషన్‌బాగ్, మహమూద్ నగర్,1 నుంచి 3 గంటలు వరకు హుడాకాలనీ,శివాజీనగర్,సిక్‌చావనీ,నౌ నెంబరు రోడ్డు.పాండు రంగానగర్,3 నుంచి 5 గంటలు వరకు పాండురంగా నగర్,శిఆజీనగర్,సిసిఎండి,3 నుంచి 5 గంటలు వరకు అస్రా ఆసుపత్రి, మొగల్‌పుర,పిస్తా హౌస్,మంజిలి బేగం హవేలీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ సిబిడి విద్యుత్ అధికారులు తెలిపారు.రషీద్ నగర్ ఫీడర్ పరిదిలో 10 నుంచి 1 వరకు,సలాల,తానాజీ నగరన ఫీడర్ల పరిధిలో 11 నుంచి 1 గంట వరకు,ఇంద్రానగర్,ఉప్పుగూడ ఫీడర్ల పరిధులో 1నుంచి 3 గంటలు వరకు,మైసారం,నీలం సెంటర్ల ఫీడర్ల పరిధులలో 3 నుంచి 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# 31న నిరుద్యోగ యువతీయువకులకు జాబ్ మేళా

**హైదరాబాద్, మే 24,ప్రభాతవార్త:** పరావస్తు క్రియోటివ్ ఫౌండేషన్ , రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్‌లాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకుల కోసం ఈనెల 31న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్ ,ముప్పారాంరెడ్డి, లక్ష్మీకుమారిలు శుక్రవారం ఒప్రకటనలో తెలిపారు. ఈజాబ్ మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపనీలతో పాటు ఇతర పేరొందిన సంస్థల పాల్గొని వివిధ రకాల ఉద్యోగులను నియమించుకోనున్నట్లు వారు వెల్లడించారు. 10వ తరగతి బిటెక్, ఎంబిఏ అర్హతగల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18-30 సంవత్సరాల వయస్సు ఉన్నవారు అర్హులని ఈజాబ్‌మేళాలో సుమారు 25సంస్థలు పాల్గొని 5వేల ఉద్యోగాలను భర్తీ చేసుకుంటాయని వారు తెలిపారు. ఈజాబ్‌మేలా రాణీగంజ్ గుజరాతీ హైస్కూల్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9542433427లలో వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

# శాకాహార గుర్తింపుకు సాత్విక్ సర్టిఫికేషన్

**హైదరాబాద్, మే 24,ప్రభాతవార్త:** బౌద్ధ, జైన మతస్తులతోపాటు జంతు హింసను ఇష్టపడని వేగాన్స్‌కోసం పూర్తిస్థాయి శాఖార వస్తువులు లేక ఆహార పదార్థాంగా గుర్తించేందుకు సాత్విక్ సర్టిఫికేషన్ ముందుకు తీసుకువచ్చినట్లు సాత్విక్ సర్టిఫికేషన్ వ్యవస్థాపకులు అభిషేక్ భిశ్వాస్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాత్విక్ సర్టిఫికేషన్స్ బ్రోచర్లు, లోగోలను సింగపూర్ డైరెక్టర్ హుజాంగ్ హంగ్, అక్షాగ్ ఫూడ్స్ సిఈవో దీప్ గోయెల్ ,డైరెక్టర్ రిద్దీ వత్సానితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ బౌద్ధ,జైన మతస్తులు , శాఖాహార హోటళ్లు, రెస్టారెంట్లు, మార్కెట్‌లో వివిధ రకాల ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతుంటారని ,అలాంటి వారికి పూర్తిస్థాయిలో శాఖాహార పదార్థాలు అందాలన్న ఉద్దేశ్యంతో ఈఆర్గనైజేషన్‌ను స్థాపించామన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలతోపాటు అస్ట్రేలియా వంటి దేశాల్లో నూ ఆహార ఉత్పత్తి సంస్థలు తమ సర్టిఫికేషన్‌స పొందుతున్నాయని తెలిపారు. అన్నిరకాల పరీక్షలు, నిర్ధారణలు జరిగిన తర్వాతే తమ లోగోతో కూడిన సర్టిఫికేషన్ అందజేసానతమన్నారు. తమ సర్టిఫికేషన్ పొందిన హోటళ్లలో వందకువందశాతం వెజిటేరియన్ ఆహార పదార్థాలు అందిస్తారన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**కొంపల్లి, మే 24, ప్రభాతవార్త :** నేడు ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు 11కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలో విటీస్ విల్లాస్, నాగార్జున డ్రీమ్ ల్యాండ్, శాంతినికేతన్, అమృత ప్రాజెక్ట్స్, నూజివీడు కంపెనీ, గజానన హోమ్స్, రాయల్ పార్క్, అశ్విని కాలనీ, వెండిగూడు విస్తార ప్రాజెక్టులు గ్రీన్‌కౌంటి ప్రాంతాలతో పాటు.. కొంపల్లి సబ్ స్టేషన్ నుండి మధ్యాహ్నం 3 గంటల నుండి 4:30 గంటల వరకు 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో కొంపల్లి గ్రామం, మున్సిపల్ ఆఫీస్, సెంట్రల్ పార్క్, హాస్టల్స్, రత్నదీప్, క్లౌడ్‌నైన్ హాస్పిటల్, డిలైట్ హోటల్, బొద్దురాయి, కుమ్మర బస్తీ, ఆంధ్రబస్తీలలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని టీజీఎస్‌పిడిసిఎల్‌కు సహకరించాలని కొంపల్లి ఏఈపి వినాయక్‌రాథోడ్ తెలిపారు.

**నిజాంపేట్ ప్రాంతంలో..**

11కేవీ ఫీడర్‌లో 11 గంటల నుండి 12:30 గంటల వరకు శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోలస్ స్టేషన్, 11కేవీ సాయినగర్ ఫీడర్‌లో 1:30గంటల నుండి 3 గంటల వరకు సాయినాగర్ ఎస్ఆర్, ఆర్‌జికె, 11కేవీ వికాస్ ఫీడర్‌లో 3 గంటల నుండి 5 గంటల వరకు వికాస్ పబ్లిక్ స్కూల్, సాయి క్రిష్ణజ హిల్స్, సూర్య గ్లోబల్ స్కూల్, టెక్నో పోలీస్, తెలంగాణ ఇంజనీరింగ్ బిల్డింగ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

**బొల్లారం సబ్‌స్టేషన్‌లో..**

33/11 కేవీ ఎన్‌రిచ్ బొల్లారం సబ్ స్టేషన్, 11కేవీ మల్లంపేట ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు మల్లంపేట్ గ్రామం, జిఎల్‌సి భవన్ విల్లాలు, డ్రీమ్ వ్యాలీ కాలనీ, ఆకాష్ లేఅవుట్, గ్రీన్ పార్క్, ఏపిఆర్ విల్లాలలో అలాగే, 11కేవీ బాలాజీ ఎన్‌క్లేవ్ ఫీడర్‌లో 33/11 కేవీ ఎన్రిచ్ బొల్లారం సబ్ స్టేషన్ నుండి మధ్యాహ్నం 3 గంటల నుండి 4:30 గంటల వరకు బాలాజీ ఎన్‌క్లేవ్, ఖాజీపల్లి రోడ్, ప్రణీత్ జెమ్స్, ఆంధ్రా బ్యాంక్ వెనుకవైపు, బీసీ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి.సాయి కిరణ్ తెలిపారు.

**ప్రశాంతి హిల్స్ :** 33/11 కేవీ ప్రశాంతి హిల్స్ 11కేవీ మిథిలా నగర్ ఫీడర్‌లో సాయంత్రం 3 గంటల నుండి 4:30 గంటల వరకు అలాగే 33/11 కేవీ అలీప్ 11కేవీ పంచవటి ఫీడర్‌లో వెంకటేశ్వర ఆలయం, మిథిలా నగర్ సర్కిల్, ఆర్‌కె లే అవుట్, ఆదిత్య వెంచర్, డాలర్ హిల్స్, ప్రశాంతి గోల్డెన్ హిల్స్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ డి.సమ్మయ్య తెలిపారు.

**జీడిమెట్ల ప్రాంతంలో :** నేడు 11 గంటల నుండి 12:30 గంటల వరకు 33/11 కేవీ జీడిమెట్ల 11కేవీ ఎన్ఐటిసిఓ ఫీడర్‌లో జీడిమెటన్ల పారిశ్రామిక, మధ్యాహ్నం 2 గంటల నుండి 3:30 గంటల వరకు 11కేవీ సైకాంత ఫీడర్‌లో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం, 11కేవీ జెఐటిఎల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3:30 గంటల నుండి 5 గంటల వరకు జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పి.ప్రసూన తెలిపారు.

# బొబ్బిలి భాస్కరరెడ్డికి 'పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు' సంగీత పురస్కార ప్రదానం




బొబ్బిలి భాస్కరరెడ్డికి 'పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు' సంగీత పురస్కారాన్ని అందించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 24 ప్రభాతవార్త:** జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుడిబండి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు బొబ్బిలి భాస్కరరెడ్డి సంగీత స్వర్ణోత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా బొబ్బిలి భాస్కరరెడ్డికి 'పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు' సంగీత పురస్కారాన్ని ముఖ్యఅతిథిగా హాజరై విశ్రాంత ఐఏఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అందించి గౌరవించారు. పారిశ్రామికవేత్త డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, మెదక్ జిల్లా పరిషత్ పూర్వ చైర్మన్ ఎంఎల్.కాంతారావు, న్యాయవాది డాక్టర్ టి.విజయభాస్కరరెడ్డి, జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వివి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాయకుడిగా, సంగీత దర్శకుడిగా బొబ్బిలి భాస్కరరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని రమణాచారి అన్నారు. ఈ కార్యక్రమంలలో భాగంగా బొబ్బిలి భాస్కరరెడ్డి నిర్వహణలో నిర్వహించిన సంగీత విభావరిలో ప్రముఖ గాయనీ గాయకులఉ డివి.మిత్ర, డి.సురేఖామూర్తి, హెచ్.హేమవతి, వి.శశికళాస్వామి, ఆర్.శ్రీనివాస్, ఎన్.సంగీతారెడ్డి తదితరులు అద్భుతంగా గానం చేశారు.

# పేదలకు దుస్తులు పంపిణీ చేసిన కార్పొరేటర్



పేదలకు దుస్తువులు అందచేస్తున్న జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

**అఫ్జల్‌గంజ్,మే24ప్రభాతవార్త:** గౌలిగూడ సిబిఎస్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ నిరుపేదలకు కొత్త దుస్తువులను పంపిణి చేశారు.దివంగత తన తండ్రి బీమ్‌సేన్‌జైస్వాల్ జ్ఞాపకార్థం సుమారు వందమందికిపైగా దస్తువులను అందచేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో అమర్‌సింగ్,సుధీర్, అనిల్‌యాదవ్, ఖాజాల్, రామకృష్ణ,రేణుక,రఘు,సందీప్,రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ దేవాలయం అధ్యక్షుడిగా నాగేష్ ఏకగ్రీవం

**అఫ్జల్‌గంజ్,మే24ప్రభాతవార్త:** స్వామి వివేకనందనగర్ కనకదుర్గమ్మ దేవాలయం అధ్యక్షులుగా 6వ సారి పోల్లేనాగేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈమేరకు ఆలయం లో జరిగిన సర్వసభ సమావేశంలో బస్తీవాసులు,నవయువకులు నాగేష్‌ను ఎన్నుకు న్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి 6వసారికనకదుర్గమ్మ దేవాలయం కమిటికి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకుగా ప్రత్యేక ఒకరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే తెలంగాణ ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురానాపూల్ స్వామివివేకనందనగర్‌లోని వెలిసి కనకదుర్గమ్మ ఆలయంలో అందరి సహాయ సహాకారాలతో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకుగాను ప్రత్యేక కమిటిని నియమించడం జరుగుతుందన్నారు.బోనాల ఉత్సవాలే కాకుండా ఆలయంలోజరిగే ప్రతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.ప్రధాన కార్యదర్శిగా మాగి ప్రభాకర్‌ను ఎన్నుకోవడంజరిగింది.త్వరలోనే ఆలయ కమిటి పూర్తిస్థాయిలో నియమిస్తామన్నారు.

# ఘనంగా ఋగ్వేద సంహిత సంస్కృత గ్రంథావిష్కరణోత్సవం



ఋగ్వేద సంహిత గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభు, సుబ్రహ్మణ్యం, అనంతకృష్ణ తదితరులు

**నాంపల్లి, మే 24 ప్రభాతవార్త :** సురభారతి సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృతశాఖ పూర్వాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.శ్రీరాములు సభాధ్యక్షతన ఋగ్వేద సంహిత సంస్కృత ఉద్గ్రంథాన్ని ఎన్ఐసి పూర్వ డీజి డా. సిఎస్ఆర్ ప్రభు ఆవిష్కరించారు. విజయవాడ కనకద్గు దేవస్థానం వేద పండితుడు చిలుకలూరిపేట సుబ్రహ్మణ్యం సంపాదకత్వంలో రూపొందిన ఈ గ్రంథం గురించి డా. సోమయాజులు, అనంతకృష్ణలు ప్రసంగించారు. డా. పోతు కూచి ఉమాభటేశ్వరశర్మ ప్రభృతులు పాల్గొన్నారు.

# దేశంలో మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేయాలి

**-చార్మినార్ బిజెపి నాయకులు డిమాండ్**



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**చార్మినార్,మే 24 ప్రభాతవార్త :** పశ్చిమ బెంగాల్‌లోని ఓబీసీల అంశంపై కోల్‌కతా హైకోర్టు తీర్పు హర్షణీయమని గోల్కొండ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చ కార్యదర్శి గౌరీ శంకర్ సోనీ అన్నారు.పాతబస్తీ బహదూర్‌పుర దేవిబాగ్‌లో గోల్కొండ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2010 తర్వాత జారీ చేసిన అన్నీ ఓబీసీ పత్రాలను రద్దు చేస్తూ తీర్పును ఇవ్వటం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వానికి చెంప పెట్టన్నారు.కోల్‌కతా హైకోర్టు తీర్పును ఓబీసీ మోర్చ స్వాగతిస్తున్నదని ఆయన తెలియజేశారు.ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వైఖరీని బిజెపి నాయకులు ఖండిచారు.మతపరమైన రిజర్వేషన్లు రద్దు చేయాలని చార్మినార్ బిజెపి నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఎం.కుమార్,నాయకులు ప్యారసాని వెంకటేష్,కరణ్‌జే,స్వర్ణకార సమాజ్ ప్రతినిధి నవనీత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రజలతోనే ఉండి ప్రగతి సాధించాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌కు సిఎం సూచన**



**నందిగామ, మే24,ప్రభాతవార్త :** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం సిఎంను కలిశారు. మనకు ప్రజలే దేవుళ్లని అనునిత్యం ప్రజలతో మమేకమై పాలకునిగా కాకుండా ప్రజల సేవకుడిగా పనిచేసి షాద్‌నగర్ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సూచించినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. సిఎంను కలిసిన అనంతరం ఎమ్మెల్యే శంకర్ షాద్‌నగర్ నియో జవర్గంలో ప్రణాళికా బద్ధంగా చేపట్టాల్సిన పలు అభివృ ద్ధి, సంక్షేమ పథకాల విషయమై సిఎంకు ఎమ్మెల్యే విన్నవించినట్లు పేర్కొన్నారు.

# విజయవంతమైన 'విత్తనమేళా'

**నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నత్నాయపల్లి వ్యవసాయ పరిశోదన స్థానంలో శుక్రవారం నిర్వహించిన విత్తనమేళా కార్యక్రమంలో హాజరైన రైతులకు వివిధపంటలపై అవగాహన కల్పించడం జరిగిందని వ్యవయసాయ పరిశోదన స్థానం ప్రదాన శాస్త్రవేత్త టి.శోభరాణి తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్న ఉద్దేశంతో నత్నాయపల్లిలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో విత్తన మేళ జరిగింది. ఈ మేళాలో నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంచ డం జరిగిందన్నారు. అంతేగాక రైతులకు పంటల సమగ్ర సమాచారం గురించి వ్యయసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాన్నారు. ఈ విత్తన మేళా కార్యక్రమంలో నత్నాయపల్లి వ్యయసాయ పరిశోదన స్థానం ప్రదాన శాస్త్రవేత్త టి.శోభరాణి తో పాటు తెలంగాణా రైతు రక్షణ సమితీ జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమ్మోల్ల మైసయ్యాయాదవ్, సంగారెడ్డి కోఆర్డి నేటర్ రంగాగౌడ్,నర్సాపూర్, హత్నూర, కౌడిపల్లి ,శివ్వంపేట, కొల్చారం మండలాలకు చెందిన రైతుల తదితరులు పాల్గొన్నారు.

# అన్నోజిగూడలో చైన్‌స్నాచింగ్

**ఘట్‌కేసర్ రూరల్, మే 24, ప్రభాత వార్త:** తల్లి కూతురు స్కూటీపై వెళ్తుండగా కూతురు మెడలో నుండి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోచారం ఐటీసీ పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన బీ ఫార్మసీ విద్యార్థిని ఎ.శ్రీజ తన తల్లి సునీతతో కలిసి గురువారం సాయంత్రం జోడిమెట్ల నుండి ఇంటికి స్కూటీపై వస్తుండగా అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెంబడించారు.. ఇదీ గమనించిన తల్లి సునీత స్కూటీపై వేగంగా వెళ్తుండగా వెనుక కూర్చొని ఉన్న శ్రీజ మెడలో నుండి బంగారు గొలుసును లాగడంతో బైక్ పైనుండి ఇద్దరు పడిపోయారు. దీంతో స్థానికులు గాయాలపాలైన ఇరువురిని స్థానిక నీలిమ ఆస్పత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అందించినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి సం దర్శించారు. అనంతరం బాధితులను ఆస్పత్రిలో పరామర్శించి వివరాలు అడిగితెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## విత్తన కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా వ్యవసాయ అధికారి మేరి రేఖ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 24,ప్రభాతవార్త**

జిల్లా రైతాంగం విత్తనాలు కొనుగోలు విషయంలో అప్రమత్తంగ ఉండాలని, నాణ్యత లేని విత్తనాలతో అక్రమార్గాన కొందరు అమ్మకాలకు వస్తారని తక్కువ ధరకు అమ్ముతారని రైతులు అప్రమత్తంగ ఉండాలని, వ్యవసాయ శాఖ నుంచి అనుమతి ఉన్న డీలర్స్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి పి.మేరి రేఖ సూచించారు. శుక్రవారం ఆమె పేర్కొంటూ వానాకాలం సీజన్ మొదలు అవుతున్న తరుణంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేయటానికి సిద్దం కావటం జరుగుతుందన్నారు. విత్తనాలు కొందరు నాణ్యతలేనివి తక్కువ ధరకు అమ్మటానికి వస్తారని వారి పట్ల రైతులు అప్రమత్తంగ ఉండాలన్నారు. విత్తన కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవలసిని జాగ్రత్తలు అనే అంశంపై ప్రతి గ్రామంలో అవగాహణ కార్యక్రమాలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికంగ ఎఇఒ, ఏఒ, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఉదయం 7.30గంటల నుంచి 11.30గంటల వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన అధికృత డీలర్స్ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ప్యాకింగ్, లేబుల్ కలిగిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కాలపరిమితి చెల్లిన విత్తనాలను కొనుగోలు చేయకూడదని అలాంటివి ఉంటే వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన డీలర్ దగ్గర నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్,బిల్లును పంటకాలం పూర్తి వరకు భద్రంగ ఉంచుకోవాలని ఆమె సూచించారు. విడిగా విత్తనాలను గుర్తు తెలియని వ్యక్తుల నుంచి లైసెన్స్ లేని స్థలం నుంచి ఎట్టి పరిస్థితిలో కొనుగోలు చేయవద్దని ఆమె సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి జరిగే రైతుల అవగాహన కార్యక్రమాలకు రైతులు అందరు పాల్గొనాలని జిల్లా వ్యవసాయ అధికారి పి.మేరి రేఖ సూచించారు.

### పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి



పాఠశాలల్లో జరిగే పనులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

**దౌల్తాబాద్,మే 24,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పలు పనులను జిల్లా విద్యాధికా రిని రేణుకాదేవి శుక్రవారం రోజు పరిశీలించారు.అనంతరం మండల కేంద్రంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల ఏకరూప దుస్తూల తయారీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ వెంకటయ్య,హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయించాలి

**వికారాబాద్ జిల్లాప్రతినిధి ప్రభాతవార్త :** ప్రత్తి విత్తనాలను కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన గరిష్ట ధరకే విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తెలిపారు.ఎలాంటి కంపెనీలైన విత్తనాలైన నిర్ధేశించిన కంటే ఎక్కువగా విక్రయించరాదని అన్నారు.విత్తనాల విక్రయాలలో రైతులకు నకిలీ, విడిగా,గుర్తింపు పొందని ప్రత్తి విత్తనాలను విక్రయించరాదని ఆయన అన్నారు. ప్రత్తి విత్తన సంచి మీద జిఈఎసి సంఖ్య లేనివి ఎట్టి పరిస్థితులలో విక్రయించరాదన్నారు.విత్తనాల కృత్రిమ కొరత సృష్టించరాదని క్రయ విక్రయాలను ఎప్పటికప్పుడు దస్త్రాలలో నమోదు చేయాలని తెలిపారు.స్టాక్ బోర్డుపై ఎప్పటికప్పుడు నిలువ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకలను అతిక్రమిస్తే వారి లైసెన్సు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతందని ఆయన హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన ప్రతి విత్తనాల గరిష్ట ధర బిజి -1కి 635 రూపాయలు,బిజి 2కి 864 రూపాయలుగా నిర్ధారించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని విత్తన షాప్ డీలర్లు అందరు తప్పనిసరిగా రైతులకు అమ్మిన వివరములు రైతు వారీగా రిజిస్టర్‌లో పొందుపరచాలని, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లను తనిఖీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు నకిలీ విత్తనాలను ,లూజ్ ప్రత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.అపరిచిత వ్యక్తుల వద్ద ఉన్న నిల్వను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిపై పిడి యాక్ట్ కింద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

### నారపల్లి, చౌదరిగూడలో విద్యుత్ అంతరాయం

**ఘట్‌కేసర్, మే 24, ప్రభాతవార్త:** విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నారపల్లి విద్యుత్ ఏఈ వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. నారపల్లి 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని ఎపీ మీట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో కరెంట్ తీగల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని తెలిపారు. సప్తగిరికాలనీ, సురేందర్‌రెడ్డికాలనీ, బాబానగర్, గణేశ్‌నగర్, నారపల్లిలో రెండు గంటల పాటు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. పోచారం 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోని జోడిమెట్ల 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిదిలోని అన్ననగర్, డాక్టర్స్‌కాలనీ, జోడిమెట్ల చౌరస్తా, అరుంధతి కాలనీ, హుడా కార్తికేయచ కాకతీయనగర్, స్వర్ణగిరికాలనీ, వైష్ణవినగర్, చౌదరిగూడలో మధ్యాహ్నం 2 గంట నుంచి 4 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని తెలిపారు. నారపల్లి 33/11 కేవీ ఉపకేంద్రం పరిధిలోనిపర్వతాపూర్ 11కెవీ ఏజిఎల్ ఫీడర్ పరిధిలోని సప్తగిరికాలనీ, సత్తిరెడ్డి ఎజిఎల్ బావి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సేజ్ స్కూల్, బాపూజీనగర్, సూర్యోదయకాలనీ, ధరణికాలనీ, సుదర్శన్‌నగర్ కాలనీలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్ర ం 5 గంటల వరకు కరెంట్ ఉండదని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి : కలెక్టర్




కలెక్టరేట్‌లోని విసి మీటింగ్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అదనపు కలెక్టర్ అభిషేక్‌ఆగస్త్య, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాధస్వామి, అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 24, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని, అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ మరింత మెరుగైన సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి మీటింగ్ హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ గౌతమ్ ఒకొక్కక్క విభాగాల వారీగ సమీక్షిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా సాదారన ప్రసవాలు, సీజేరియన్ ఎంత వరకు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. సిజేరియన్ (సి సెక్షన్) తగ్గించాలని ఆయన సూచించారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి సి సెక్షన్ ఆడిట్ నిర్వహించాలన్నారు. బస్తీ దావాఖానాలో మెడిసిన్ అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన సూచించారు. స్క్రీనింగ్ పరీక్షలు ఏ విధంగ జరుగుతున్నాయని, ఎలా నిర్వహిస్తున్నారని ఆయన అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్ పరీక్షలు తదుపరి బస్తీ దావాఖానా, పిహెచ్‌సిలలో హైపర్ టెన్షన్, షుగర్ మందులను పంపిణీ గురించి నెలకు ఎంత మంది తీసుకుంటున్నారని అధికారులు వివరించారు. మందులు తీసుకొని వారికి అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఉచితంగ మందులు ఇస్తున్నట్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఆర్‌బిఎస్‌కె టీముల పని తీరు గురించి సంబంధిత అధికారులు వివరించారు. ఎన్‌డిసి, ఇమ్యునైజేషన్, మాత ఆరోగ్య సేవలు మరింత బలోపేతం చేయాలన్నారు. బర్త్ ప్లానింగ్, కాన్పుల సంఖ్య ఎన్‌సిడి టెలికన్సలేషన్ సేవలపై ప్రజలకు ముమ్మరంగ అవగాహన కల్పించాలన్నారు. 100శాతం గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు వెళ్లేలా వైద్య అధికారులు ప్రోత్సహించాలన్నారు. టిబి రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలలో వ్యాక్సిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. మినీ హబ్స్ ఏర్పాటు గురించి ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రభల కుండ తగు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.రఘునాధస్వామి, డిసిహెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సూపరిండెంట్లు, జిల్లా వైద్య అధికారులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బెల్టు షాపుల నియంత్రణకోసం చర్యలు తీసుకోవాలి

**ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి**

**గృహ వినియోగదారులవద్ద కరెంటు బిల్లులు వసూలు చేయొద్దు**

**సర్వసభ్య సమావేవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి,పక్కన ఎంపిపి మల్లేశం తదితరులు

**పూడూరు, మే 24. ప్రభాతవార్త :** గ్రామాల్లో బెల్టు షాపులతో పాటు, డ్రగ్స్ నియంత్రణకోసం తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి పూడుగుర్తి మల్లేశం అద్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మంచన్‌పల్లి గ్రామంలో దేవాలయం ప్రక్కనే బెల్టు షాపును నిర్వహించడంవల్ల చుట్టపక్కల ప్రాంత కుటుంబాలతోపాటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయం పలుమార్లు సభ దృష్టికి తెచ్చినా ఫలితం తేదని ఎంపిటిసి లక్ష్మణ్ ఆరోపించగా, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పందిస్తూ అటాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు నివేదిక సమర్పిస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. వేసవి సందర్భంగా త్రాగునీటి సమస్యల పరిష్కారంకోసం నియోజక వర్గానికి సుమారు రూ.10కోట్ల ప్రత్యేక నిధులను ముందు జాగ్రత్తగా కేటాయించానని వివరించారు. మండల పరిధిలోని రేగడి మామిడిపల్లి రైతుల విజ్ఞప్తిమేరకు వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకున్నానని తెలిపారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. గ్రామాల్లో 2వందల యూనీట్లవరకు గృహ వినియోగదారులవద్ద బిల్లులు వసూలు చేయరాదని ఏఈఒకు సూచించారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహం సమీపంలోఉన్న గుంతవల్ల వసతిగృహంలోకి విషస్వర్పాలు వస్తున్నందున విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని.ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వార్డెన్ సభదృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసి మేఘమాలగుప్త, కోఆప్షన్ సభ్యులు ఆయూబ్, ఎంపిటిసిలు సురేందర్,నాగమణి,ఆరీఫ్,మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తహశీల్దారు రమాదేవి, ఎంపిడిఓ పాండు,విద్యాధికారి హరీశ్చంద్ర, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో ఘనంగా విత్తన మేళా



విత్తనాల మేళాలో పాల్గొన్న డా.సి సుధారాణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు నాణ్యమైన విత్తనం అందించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మే 24న విశ్వవిద్యాలయంలో పెద్ద ఎత్తున విత్తన మేళ్లాను నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా తాండూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం విత్తనమేళా నిర్వహించారు.ఈ విత్తన మేళాను అధిపతి డా.సి సుధారాణి ప్రారంభించారు.రైతులకు నూతన వంగడాల లక్షనాలు వాటి గుణగణాలపైన అవగాహన కలిగించడానికి శాస్త్రవేత్తలతో చేర్చా వేదికను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ పరిశోధన స్థానం,తాండూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. సుధారాణి అధ్యక్షతన వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.సుజాత మాట్లాడుతూ కందిలో అంతర పంటలుగా పెసర,మినుము,సోయాచిక్కుడు, కొర్రలు, సాగుచేసుకున్నట్లయితే అధిక లాభాలు పొందవచ్చని తెలియజేశారు.వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.సుధాకర్ మాట్లాడుతూ...నల్ల రేగడి భూములలో కంది పంటను జంటసాళ్ల పద్ధతిలో సాగు చేయడం ,నీటి ముంపునకు గురై బోదెలు,కాలువలు పద్ధతిలో పంట భూమిని తయారు చేసుకొని కంది పంటబోదేలపై విత్తుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. చివరగా వ్యవసాయ పరిశోధనస్థానం తాండూరు ప్రధాన శాస్త్రవేతనత అధిపతి డా.సుధారాణి మాట్లాడుతూ...వివిధ పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు మెలైనయాజమన్య సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ విత్తన మేళాలో వ్యవసాయ పరిశోధన స్థానం తాండూరు రూపొందించిన వివిధ ఒది రకాలను అనగా తెలంగాణ కంది-3 (టిడిఆర్‌జీ-59) మరియు ఆశ (ఐసిపిఎల్..87119)రకాల విత్తనాలను రైతులకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.రాజేశ్వర్ రెడ్డి,వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ గ్రామాల రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి,ఎమ్మెల్యే మల్లారెడ్డికి మరో షాక్..

**ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మించిన ప్రహరీ నిర్మాణాల కూల్చివేత**

**శామీర్‌పేట, మే 24, ప్రభాతవార్త** మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డికి మరో షాక్ తగిలింది. శుక్రవారం శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేట్‌లోని చెరువు శిఖం ఎఫ్‌టిఎల్ పరిధిలో ప్రహరీగోడను ఏర్పాటు చేశారని గుర్తించిన అధికారులు వాటిని జెసిబితో కూల్చివేశారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డికి బొమ్మరాసిపేట్‌లో సుమారు 7ఎకరాల వరకు భూమి ఉండి దానికి ప్రహరీని నిర్మాణం చేపట్టారు. ఆ భూమిలో చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఆయన అక్రమంగ ప్రహరీ నిర్మాణాలు చేశారని అధికారులకు ఫిర్యాదు అందటంతో ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉందని ఇరిగేషన్, రెవెన్యూ,పంచా యతీ అధికారులు విచారించి గుర్తించినట్లు దీంతో డిఎల్‌పిఒ సాంబిరెడ్డి,మండల ఎంపిఒ సునిత, స్థానిక కార్యదర్శి దేవేందర్‌రావు, పలువురు మండల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొని జెసిబితో ఆ ప్రహరీని, మట్టి రోడ్డు కట్టడాలను జెసిబితో కూల్చివేశారు. పంచాయతీ అధికారుల బృందం పాల్గొని ఆ అక్రమ నిర్మాణాలను కట్టడాలను కూల్చివేశారు.

ఎఫ్‌టిఎల్ పరిధిలో మరిన్ని నిర్మాణాలు మట్టి కట్టలను కూడ జెసిబితో తొలగించారు. ఇటీవలనే నగర శివారు కుత్బు ల్లాపూర్‌లోని జీడిమెట్లలో సుచిత్ర పరిధిలో సర్వేనెంబర్లు 82,83లలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఇతరుల మధ్య నెలకొన్న భూ వివాదం నెలకొన్న (జరిగిన) సంగతి తెలిసిందే.



బొమ్మరాసిపేట్‌లోని చెరువు పరిధిలో (ఎఫ్‌టిఎల్) నిర్మించిన ప్రహరీగోడను జెసిబితో కూల్చివేసిన అధికారుల దృశ్యం



బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని రాస్తారోకో నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ నాయకులు

## అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలి

**ఆదిభట్ల మే24,ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని శేరిగూడ గ్రామంలో గల శ్రీ హిందూ కళాశాల ముందుగాల అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం పార్టీ నాయకులు,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు.ఈ బ్రిడ్జిని వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం పార్టీ మరియు ప్రజాసంఘాల ధర్నాకు దిగాయి.ఈ బ్రిడ్జి కొరకై 2023 ఫిబ్రవరి నెలలో మంజూరైన మూడు కోట్ల 60లక్షల ఒక కోటి రూపాయల ఖర్చు మాత్రమే చేసి బ్రిడ్జిని అసంపూర్తిగా ఉంచి వాహనదారులకు ఇబ్బందికి ప్రధాన కారణం అయ్యారు. మిగిలిన రెండు కోట్ల 60లక్షలు వివరాలు ఇవ్వాలన్నారు.బ్రిడ్జి కొరకే మంజూరైన మొత్తం సొమ్మును దుర్వినియోగం చేశారని సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి మాన్యువల్ తెలిపారు.రోడ్లు మరియు భవనాల మంత్రి అయిన కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఈ బ్రిడ్జి గురించి పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ మధ్య వర్షాలు పడడంతో రోడ్లు చెడిపోయి వచ్చి పోయే వాహనాలకు మరింత ఇబ్బందిగా మారిందని అలాగే యాక్సిడెంట్లకు ఆస్కారం ఎక్కువగా ఉందని వెంటనే ప్రభుత్వం పట్టించుకొని వీలైనంత తొందరలో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లేకుంటే మళ్లీ పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని తెలిపారు.

## ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

**తెలంగాణ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి**

**పెద్దేముల్,మే 24, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తెలంగాణ మాడల్ స్కూల్ గొట్లపల్లి జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ మొ దటిసంవత్సరము (యంపిసి,బైపిసి, సీఈసీ, యంఈసి) గ్రూపులలో ప్రవేశం కోసం ఈ నెల 25న(నేడు చివరి రోజు) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనిపాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ గాయత్రి మాట్లాడుతూ అనభవజ్ఞులైన సిబ్బందితో ఆంగ్లమాధ్యమంలో భోధన ఉంటుందని అన్నారు యంపిసి, బైపిసి విద్యార్థులకు అదనంగా ఈఏపీసీఈ, నీట్, ఐఐటి, జేఈఈలో ఉచిత కోచింగ్, యంఎస్‌అపిస్ కమ్యునికేటివ్ ఇంగ్లీష్ లో ఉచిత కోచింగ్ ఇవ్వబడుతుందని అన్నారు. సకల సౌకర్యాలతో కూడిన విశాలమైన భవనం, తరగతి గదులు, ఆటస్థలం ఉందని అన్నారు.లైబ్రరితో పా టు డిజిటల్ టీచింగ్ చెప్పబడుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో నేడే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఎఓ



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అరుణకుమారి

**ఆమనగల్లు, మే24, ప్రభాతవార్త:** ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి ఆధీకృత ఢీలర్లను హెచ్చరించారు. రైతులను మోసం, అధిక ధరలు, నకిలి విత్తనాల విక్రయాలకు పాల్పడినా ఎంతటి వారైనా ఉపేక్షించేంది లేదన్నారు.శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని పలు ఆధీకృత డీలర్ల ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన ఇన్వాయిస్, బిల్లులు, రైతులకు మంజూరు చేసిన బిల్లులు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. రైతు కొనుగోలు చేసిన ప్రతి దానికి తప్పనిసరిగా సంబంధిత బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. వర్షాకాలం పంటల సాగు నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారి అరుణకుమారి తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు సురేష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు : ఎడిఎ



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

**కొడంగల్ రూరల్, మే 24 (ప్రభాతవార్త):** ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని తాండూర్ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను కొడంగల్ ఏవో లావణ్యతో కలిసి తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

### అక్రమ లేఅవుట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్‌కు బిజెపి మేడ్చల్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు**

**మేడ్చల్, మే 24. ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ యాజనామ్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్, డిపిఓ, ఎంపిడిఓలకు ఫిర్యాదు చేశాడు. మేడ్చల్ మండలంలోని నూతన్‌కల్, శ్రీరంగవరం గ్రామాల రెవెన్యూ పరిధిలోమంతెన ఇన్ఫ్రా పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతే కాకుండ ప్రభుత్వానికి చెల్లించవలసిన వ్యవసాయేతర భూమి మార్పిడి (నాలా)రుసుము చెల్లించకుండా అక్రమంగా లే అవుట్ చేసి అందులో రోడ్లు, క్లబ్ హౌజ్, ప్రహరిగోడతో పాటు ఇతర అక్రమ నిర్మాణాలు నిర్మించారని తెలిపాడు. లేఅవుట్‌కు గేట్లు ఏర్పాటు చేసి లేఅవు ట్‌కు అనుకుని ఉన్న వ్యవసాయ పొలాలకు ఇరు గ్రామాల ప్రజలను వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించాడు. ఈ లే అవుట్‌లో సుమారు మూ డు, నాలుగు చెకువు కుంటలను, వాటర్ బాడీలు ఉన్నాయని, వాటర్ బాడీల గుండా వెడల్పాటి రోడ్డును డివైడర్‌తో ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున అసైన్‌మెంట్ భూములు, ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లు అభియోగాలు ఉన్నట్లు పేర్కొన్నాడు. అధికారులు స్పందించి అక్రమంగా లే అవుట్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుమును ఎగ్గొట్టిన మంతెన ఆన్ఫ్రా వెంచర్ యాజమాన్యంపై, వెంచర్ ఏర్పాటుకు సహకరించిన రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు.